నిర్లక్ష్యం మాటున నదీ స్నాన రేవులు

పుణ్యరోజుల్లో పవిత్ర స్నానాలు ఆచరించే స్నానరేవులన్నీ మృత్యుకూపాల్లా మారాయి. ఏటా ఏదో ఒక రేవు వద్ద భక్తులు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. కార్తీక మాసం, మహాశివరాత్రితోపాటు అనేక పర్వదినాల్లో వేలాదిమంది భక్తులు నదుల్లో పవిత్ర స్నానాలు చేస్తారు. ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల అటువంటి స్నానఘట్టాల వద్ద అడుగడుగునా ప్రమాదాలు పొంచిఉన్నాయి.



ప్రమాదకరమైన గౌరీపట్నం మార్కమ్మ రేవు

- ప్రమాదాలపై కానరాని ముందస్తు జాగ్రత్తలు
- పవిత్ర కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం

చోడవరం : ఈనెల 2వ తేదీ నుంచీ పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో స్నాన రేవుల్లో స్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో సిద్ధమయ్యారు. ఈ నెల రోజులూ భక్తులు నదుల్లో పవిత్ర పుణ్యస్నానాలు చేస్తారు. తెల్లవారుజామున, సంధ్యా సమయంలో స్నానాలు చేసి మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగిస్తారు. మరో పక్క అయ్యప్పస్వామి మాలధారణచేసిన భక్తులు కూడా ఈ నదీ రేవుల్లోనే స్నానాలు చేస్తారు.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల మీదుగా ప్రధానమైన శారద, పెద్దేరు, తాచేరు, బొడ్డేరు, వరహా, సర్పానదులు ప్రవహిస్తున్నాయి. ఈ నదీ పరివాహక ప్రాంతాల్లో అనేక పవిత్ర స్నాన రేవులు ఉన్నాయి. పెద్దేరు, శారద, బొడ్డేరు మూడు నదుల ఒకే చోట కలిసి సంగమమై మేజర్ శారదానదిగా మారే ప్రదేశంలో పవిత్ర స్నానరేవుగా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చోడవరం మండలం ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయ స్నాన ఘట్టం ఉంది. అదేవిధంగా పెద్దేరు నది ఒడ్డున వడ్డాది వెంకటేశ్వ స్వామి కల్యాణకట్ట, కల్యాణపులోవ రిజర్వాయరు వద్ద పోతురాజు బాబు ఆలయంతోపాటు గౌరీపట్నం మార్కమ్మ రేవు, గోవాడ, గజపతినగరం, జుత్తాడ, గవరవరం, ఎర్రిగెడ్డ కొత్తకోట, పెద్ద చెరువు దొండపూడి, చిన్నకట్టు, పెట్టకట్టు కొత్తకోట, రోలుగుంట కోనేరు, పి.ఎస్.పేట ఏటిగట్టు, తుమ్మపాల, కశింకోట, ఎ.ఎస్.పేట, జోగారావుపేట, బోయినకింతాడ, కోటవురట్ల, ఉత్తరవాహిని బలిఘట్టం, వీరవల్లి అగ్రహారం స్నాన రేవులు ప్రధానమైనవి.

ఈ రేవుల్లో ఈ కార్తీకపవిత్ర మాసంలో రోజూ వేలాది మంది భక్తులు స్నానాలు చేస్తారు. కార్తీక పౌర్ణమి, ఆ మరుసటి రోజు అయితే ఈ స్నాన ఘట్టాలన్నీ భక్తులతో కిటకిటలాడుతాయి. ఇటువంటి రేవుల వద్ద అడుగడుగునా ప్రమాదం పొంచి ఉంది.



మూడునదులు కలిసే ముద్దుర్తి సంగమేశ్వర ఆలయం వద్ద ఉన్న స్నానాల రేవు

ఇసుక తవ్వకాలతో ముప్పు

గడిచిన పదిహేనేళ్లగా పలుమార్లు జరిగిన ప్రమాదాల్లో సుమారు 24 మంది ఈ రేవుల వద్ద స్నానాలు చేస్తూ మృత్యువాత పడగా అనేక మంది కొన ఊపిరితో బయటపడ్డారు. నదుల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా చేయడం వల్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదిలో నీరు ఏ మేరకు ఉందో ఆ గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక నదుల్లో స్నానాలకు దిగిన భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రేవుల్లో ఎంత లోతు మేరకు స్నానానికి వెళ్లవచ్చో ఆ మేరకు కట్టలు కట్టడం చేయాల్సి ఉంది. అటువంటి చర్యలు అధికారులు చేపట్టకపోవడం వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుత కార్తీక మాసం పవిత్ర రోజులు ప్రారంభమైనప్పటికీ నేటికీ ఆయా స్నాన రేవుల వద్ద ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదు. దీంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రేవుల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలకు ఆదేశాలు ఇచ్చాం

చోడవరం మండలంలో నదీ పరివాహకంలో ఉన్న స్నాన రేవుల వద్ద ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఇప్పటికే వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీచేశాం. హెచ్చరిక బోర్డులతో పాటు నదుల్లో రేవుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించాం. వెంటనే ఈ పనులు చేపడతాం. స్నానాలు చేసేటప్పుడు భక్తులు కూడా అప్రమత్తంగా ఉండాలి.

–రామారావు, తహసీల్దార్

నదీ రేవుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

కార్తీకమాసంలో నదుల్లో పవిత్రస్నానాలు చేసేటప్పుడు భక్తులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లోతుగా ఉండే ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. పెద్ద రేవుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ముఖ్యంగా పిల్లలను ఒంటరిగా స్నానాలకు వెళ్ల నీయవద్దు.

– అప్పలరాజు, చోడవరం సీఐ

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : బాలికల జూనియర్ కళాశాలలో జువాలజీ అతిథి అధ్యాపకుల నియామనికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ ఎ.శోభ తెలిపారు. జువాలజీ సబ్జెక్టు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈ నెల 4వ తేదీన ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

గౌరీశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం : చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయం నూతన ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు అందాయి. ఆలయ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడుగా గూనూరు సురేష్ నియమితులయ్యారు. 35 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. నూతన కమిటీని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పూలమాలలు వేసి అభినందించారు. ఆలయం అభివృద్ధికి నూతన కమిటీ మరింతగా కృషిచేయాలని ఆయన కోరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 1వతేదీ నుంచి కార్తీకమాసం పూజలు ప్రారంభం కావడంతో నూతన కమిటీ పర్యవేక్షణలో ఆలయంలో ఉత్సవాలు ఏర్పాటు చేస్తున్నారు.

విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభ

నర్సీపట్నం : విద్యార్థుల నడవడిక పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శోభ సూచించారు. కళాశాలలో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనపైన, విద్యాభ్యాసంపై తల్లి దండ్రులు నిత్యం దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించండి

చీడికాడ : గ్రామాల్లో నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో వి.హేమసుందరరావు తెలిపారు. శనివారం ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించే సర్వేలో గ్రామస్తుల సహాయ సహకారాలు తీసుకుని సర్వే నిర్వహించాలన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మాకవరపాలెం : గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బయ్యవరం, పైడిపాల, అప్పన్నదొరపాలెం, మాకవరపాలెం, భీమబోయినపాలెంతో పాటు పలు పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు, వీధుల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టారు.

సుపథ ప్రతిభా పరీక్షలు నేడు

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలను ఆదివారం నిర్వహించనున్నట్లు సుపథ ప్రతినిధులు తెలిపారు. సుపథ రూపకర్త, జగద్గురు పీఠం ప్రతినిధి యు.వి.ఎ.ఎస్. రాజు పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ ప్రతిభా పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలలో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, సుపథ గేయాలు, కృష్ణాష్టకం, నాకు నచ్చిన దేశ నాయకుడు, మంచి విద్యార్థి అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రముఖులు చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలకు 30 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరవుతారన్నారు.

పంచాయతీ పూర్వ వైభవానికి కృషి

నాతవరం: పంచాయతీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు గ్రామస్తులంతా ఐక్యతగా సహకరిస్తే సాధ్యపడుతుందని నాతవరం సర్పంచ్ గొలగాని రాణి అన్నారు. మండల కేంద్రంలో శనివారం తడిచెత్త పొడిచెత్తపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2015లో నాతవరం పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చిందన్నారు. అప్పట్లో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌గా అంకంరెడ్డి పార్వతి, తాను ఎంపీటీసీ సభ్యురాలుగా ఉన్నానన్నారు. ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిగా నాతవరం పంచాయతీలోనే చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రం నిర్మించామని గుర్తు చేశారు. నాతవరంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తీసుకుని జిల్లా వ్యాప్తంగా పంచాయతీలో షెడ్లు నిర్మాణం చేశారన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్త పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులు తయారీ చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, మాజీ ఎంపీటీసీ సూరిబాబు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి శేషు పాల్గొన్నారు.



తడిచెత్త పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ రాణి , అధికారులు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

బుచ్చెయ్యపేట : రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తానని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. శనివారం తురకలపూడిలో గంట్ల వారి కళ్లాల వద్ద మంచినీటి బోరు పనులను ఆయన ప్రారంభించారు. ఎర్రవాయి ప్రాంతంగా గుర్తుంపు పొందిన బుచ్చెయ్యపేట మండలంలో ప్రతి ఏటా వేసవి కాలంలో భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన నిధులే కాక రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఇతర నాయకులు ద్వారా నిధులు తీసికొచ్చి బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నానని జెడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రంశెట్టి గోవింద, ముచ్చకర్ల శ్రీను, గొలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, పెదిరెడ్ల మాణిక్యం, ఇందలి కోటేశ్వరరావు, గోకివాడ వరక్రిష్ణ, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, కోరుకొండ అప్పలనాయుడు, బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉల్లింగ రాజారావు, మంత్రి నాయుడు పాల్గొన్నారు.



తురకలపూడిలో మంచినీటి బోరు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

ఆశా కార్యకర్తలపై పని భారం తగదు

నర్సీపట్నం : ఆశా కార్యకర్తలపై అదనపు పనిభారం మోపడం సరికాదని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యవతి అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు జాబ్ చార్టులో లేని పనులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం, సబ్‌సెంటర్లలో ఎంఎల్‌హెచ్‌పీల వద్ద డ్యూటీలు, సర్వేలకు రికార్డులు ఇవ్వకుండా ఆశా కార్యకర్తలకు పని భారం పెంచుతున్నారని అన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, పెన్షన్ సౌకర్యం లేదన్నారు. గొడ్డు చాకిరీ చేయిస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కె.వి.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, అరుణ, వరలక్ష్మి, రమణమ్మ, కుమారి, సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకరరావు

15లోగా స్వచ్ఛంద పంటల బీమా చెల్లించాలి

మాడుగుల రూరల్ : జాతీయ పంటలు బీమా పథకంలో భాగంగా రైతులు ఈ ఏడాది స్వచ్ఛంద పంటల బీమాను చెల్లించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు తెలిపారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయని, రుణాలు తీసుకున్న రైతులు అవసరమైన ధ్రువ పత్రాలు తీసుకుని, దగ్గరలో వున్న కామన్ సర్వీసు సెంటర్ నిర్వాహకులను సంప్రదించాలన్నారు. జాతీయ పంటల బీమా పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని, పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. జీడిమామిడి పంటకు ఎకరాకు రూ.1535 చొప్పున ఈ నెల 15 తేదీలోపు చెల్లించాలన్నారు. అపరాలు అయిన మినప పంటకు ఎకరాకు రూ.171, పెసరకు రూ.157, నువ్వుపంటకు రూ.150 చొప్పున వచ్చే నెల 15 తేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో పాటు వరి పంటకు ఎకరాకు రూ.435 చొప్పున వచ్చే నెల 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం పొందాలంటే 2019 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి రైతులు తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చి ఉండాలని, బ్యాంకు ఖాతాకు, వెబ్‌లాండ్‌లో తమ భూమి వివరాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, అంతే కాకుండా సమీపంలో గల మీ సేవా కేంద్రం వారిని సంప్రదించి, ఈకేవైసీ కూడా చేసుకోవాలని తెలిపారు.

కార్తీక ఉత్సవాల పోస్టర్ విడుదల

మాడుగుల రూరల్ : మండలంలో అతిపురాతన శివాలయం అయిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలకు సంబంధించి గోడపత్రికను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం విడుదల చేశారు. స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ చింతా వెంకట నారాయణమూర్తి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోడపత్రికను వెన్నలపాలెంలో విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాల సందర్భంగా, ఈ నెల 4, 11, 18, 25, తేదీల్లో వచ్చే కార్తీక సోమవారాలతో పాటు 12న కార్తీక ఏకదశి పర్వదినం, మూడో కార్తీక సోమవారం రోజున అన్న సమారాధన జరుగుతుందని, ఆలయ కమిటీ అధ్యక్షుడు మూర్తి తెలిపారు. 15న జ్వాలతోరణం నిర్వహిస్తామన్నారు.

రూ.4 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాకవరపాలెం : మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణ అభివృద్ధి పనులకు సర్పంచ్ అల్లంపల్లి శిరీష శంకుస్థాపన చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణను ఎత్తు చేయడంతోపాటు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం పనులు చేపట్టేందుకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవరణను గ్రావెల్‌తో ఎత్తు చేసిన అనంతరం సీసీ రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

కె.కోటపాడు : మండలంలో సూదివలస, దాలివలస గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు జరిపారు. దాలివలసలో వైద్యాధికారి ధరణి 127 మందికి, సూదివలసలో వైద్యాధికారి సాయికిరణ్ 85 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు ఇచ్చారు. రెండు గ్రామాల్లో గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన

మాడుగుల రూరల్: మండలంలో మూడు గ్రామాలల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను మండల ఈవోపీఆర్‌డీ కె. కరుణాకర్ శనివారం పరిశీలించి, కార్యదర్శులకు తగు సూచనలు చేశారు. మండలంలో వీరవల్లి అగ్రహారం, పోతనపూడి అగ్రహారం, చింతలూరు, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి, చెత్తలను వేరు చేయాలని, సంపద కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని గ్రీన్ అంబాసిడర్లకు, కార్యదర్శులకు సూచించారు. ఆయా గ్రామాలు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.ఎం.పాలెంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



కేఎంపాలెంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గంధం రామకృష్ణ తదితరులు

దేవరాపల్లి : కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో స్థానిక సర్పంచ్ గంధం రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిసరాల్లో తుప్పలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణను శుభ్రపరిచారు. స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ రామకృష్ణ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.లింగన్న, సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

గొలుగొండ : ఆయిల్‌పామ్‌సాగుపై రైతులు అవగాహన పెంచుకొని మంచి దిగుబడులు సాధించాలని ఉద్యానవనశాఖ అధికారి శిరీష, పతంజలి కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రమేష్ తెలిపారు. పాకలపాడు గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు రైతులకు నాలుగేళ్లపాటు మొక్కలు నూరు శాతం, ఎరువులు 50 శాతం రాయితీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతర పంటలకు కూడా రాయితీలు ఇస్తామన్నారు. జీడిమామిడి, ఇతర పంటకు బీమా నమోదు చేసుకోవడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రోలుగుంట: రైతుల భూ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎస్.నాగమ్మ తెలిపారు. బీబీ పట్నం గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు వినతులు అందజేశారు.

గొలుగొండ : పీఎన్‌డీ పాలెంలో తహసీల్దార్ శ్రీనివాసరావు శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు భూ సమస్యలపై రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు. రైతుల ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

కె.కోటపాడు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అందించే ప్రతి అర్జీదారునికి సంతృప్తికరంగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.సూరి అన్నారు. సింగన్నదొరపాలెం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.

మాడుగుల రూరల్: రీ సర్వేలో వచ్చిన తప్పు ఒప్పులను సరిచేసుకోవడానికి రైతులు గ్రామ సభలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని రీసర్వే డీటీ కె.గణపతిరావు అన్నారు. తాటిపర్తి పంచాయతీ పరిధిలో గల కూర్మానాథపురం రెవెన్యూ గ్రామంలో శనివారం రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 17 అర్జీలు అందాయి.

నాతవరం : తహసీల్దార్ ఎ. వేణుగోపాల్ కేశవరపు అగ్రహారం గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులతో శనివారం వెన్నలపాలెంలో గ్రామసభ నిర్వ హించారు. ఏడుగురు రైతులు అర్జీలు అందజేశారు.

జోరుగా బస్‌షెల్టర్ నిర్మాణం

బుచ్చెయ్యపేట : వడ్డాది కస్పా ఆర్అండ్‌బీ రోడ్డులో బస్ షెల్టర్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కస్పా రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు కస్పా పొలాల రైతులకు నిలువ నీడలేదు. రైతులు, ప్రయాణికుల వినతుల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తన జిల్లా పరిషత్ నిధుల రూ. 5 లక్షలు బస్ షెల్టర్ నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరు చేశారు. ఆయా నిధులతో బస్ షెల్టర్ నిర్మించారు. పనులు తొంభై శాతం పూర్తయ్యాయి.



రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

చోడవరం రూరల్: మండలంలోని బీఎన్ రోడ్డులో శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గజపతినగరం గ్రామానికి చెందిన శరగడం భాను అనే యువతి తీవ్రంగా గాయపడింది. చోడవరం నుంచి స్కూటర్‌పై గజపతినగరం వెళుతుండగా మారకమ్మ రేవు ఇటుకల బట్టీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయిన ఆమె తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను 108 వాహనంలో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేశారు. ఆమె ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ లిమిటెడ్‌లో పనిచేస్తోంది. ఐడీ కార్డు ద్వారా చిరునామా తెలుసుకుని ఆమె బంధువులకు స్థానికులు సమాచారం అందజేశారు.



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు ప్రారంభం

చోడవరం : పవిత్ర కార్తీక మాసం పూజలు శనివారం అన్ని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నెలరోజుల పాటు జరిగే ఈ పవిత్ర పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రాచీన దేవాలయమైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో రద్దీగా మారింది. మూడు నదులు కలిసే చోట పుణ్యస్నానాలు ఆచరించి ముద్దుర్తి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గోవాడ, గవరవరం, జుత్తాడ శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఆకాశ దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఈవో వి.వి.సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ మల్లునాయుడు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మత్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్ పాల్గొన్నారు.

రోలుగుంట : కార్తీక మాసం సందర్భంగా భక్తులు శివాలయాలను దర్శించుకుని అభిషేకాలు చేశారు. శనివారం నాడు స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సిద్ధి వినాయక ఆలయం వద్ద ఆడారి గణేష్ పాత్రో ఆకాశదీపం ఏర్పాటు చేశారు. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి ఇక్కడకు వచ్చి పూజలు చేశారు. ఈ మాసంలో ప్రతి రోజూ ఈ దీపం ఆరకుండా వెలిగించడం జరుగుతుందని, రాత్రి వేళ శివనామ కీర్తనలతో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘ సభ్యులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ కోరారు.

కె.కోటపాడు : కార్తీకమాసం శనివారంతో ప్రారంభం కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి, కె.కోటపాడులో భీమలింగేశ్వరాలయం, లంకవానిపాలెంలో గృహలింగేశ్వరాలయం, ఆనందపురంలో రామలింగేశ్వరాలయం, చౌడువాడలో కాశీవిశ్వేశ్వరాలయంలలో కార్తీకమాస పూజలు ప్రారంభించారు.



దీపాల కాంతుల్లో దేదీప్యంగా ప్రకాశిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరస్వామి

దేవరాపల్లి: తిమిరాం ఉమామహేశ్వర స్వామి ఆలయంలో స్థానిక పురోహితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. దేవరాపల్లి వనదేవీశ్వర, ఉమామహేశ్వరీ దేవి, బోయిలకింతాడ, పెదనందిపల్లి, చిననంది పల్లి, ఎం.అలమండ, వేచలం తదితర గ్రామాల్లో శివాలయాల్లో కార్తీక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం, వీరవల్లి అగ్రహారం, వీరనారాయణం, జంపెన, పిట్టగెడ్డ, వీజేపురం, ఎం. కోడూరు, శివాలయాలతో పాటు మాడుగుల శ్రీ భీమలింగేశ్వర స్వామి, ఉబ్బలింగేశ్వరస్వామి, కృష్ణ భూపాలేశ్వర స్వామి, స్వర్ణ లింగేశ్వర స్వామి, పార్థసారధి ఆలయాలల్లో శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్తీక మాసంలో నాలుగు కార్తీక సోమవారాలు, కార్తీక ఏకదశి, కార్తీక పౌర్ణమి రోజున ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



తిమిరాంలో ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటున్న బూడి ముత్యాలనాయుడు

బుచ్చెయ్యపేట : మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది, సీతయ్యపేట, దిబ్బిడి, గున్నెంపూడి, తురకలపూడి, విజయరామరాజుపేట, పెదమదీన, బంగారుమెట్ట, రాజాం, ఫంగిడి, గంటికొర్లాం, పొట్టిదొరపాలెం తదితర గ్రామాల శివాలయాల్లో కార్తీక పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు శివపార్వతుల విగ్రహాల వద్ద, శివలింగాల వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.